క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీరు, మజ్జిగ చలివేంద్రాలను వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ 2022 అధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి బుధవారం ప్రారంభించారు. రాఘవరెడ్డి, బలరామయ్యనాయుడు, హరిబాబునాయుడు, కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, కోశాధికారి నసీర్ అహ్మద్, రీజినల్ కోఆర్డినేటర్ రాఘవేంద్రశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

వీనులవిందుగా గాత్రకచేరి



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిర 40వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. మందిరంలో విశేష పూజలను భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ, మందిర నిర్వాహక కమిటీ కార్యదర్శి నాగదేవీప్రసాద్ ఆధ్వర్యంలో జరిపారు. విద్వాంసులు, సంగీత కళాకారులతో త్యాగరాజ పంచరత్న గోష్ఠి గానాన్ని నిర్వహించారు. అనంతరం మలేసియాకు చెందిన లక్ష్మీశేఖర్ వీణ కచేరి వీనుల విందుగా సాగింది. చెన్నైకి చెందిన గాయకుడు సాయివిఘ్నేష్‌తో ప్రధాన గాత్ర కచేరిని జరిపారు.

దివ్యాంగులకు 15న ఉపకరణాల మంజూరు

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఉపకరణాల మంజూరుకు వెంకటాచలంలోని కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నగేష్ కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులు 40 శాతానికి పైగా వికలత్వం కలిగి ఉండాలన్నారు. గత మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉపకరణాలు పొంది ఉండకూడదన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ఎవరైనా ఉపకరణాలు పొందవచ్చని చెప్పారు. బ్యాటరీ ట్రైసైకిల్ పొందేందుకు ఖచ్చితంగా 80 శాతానికిపైగా వికలత్వం కలిగి ఉండాలన్నారు. 18 నుంచి 50 ఏళ్లలోపు వారు మాత్రమే అర్హులని తెలిపారు. శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులు ఆధార్, రేషన్‌కార్డు, సదరమ్ సర్టిఫికెట్, రెండు ఫొటోలు వెంట తీసుకురావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటారు బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన కందలపాడు క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం ఉదయం చోటు చేసుకుంది. నెల్లూరులోని మనుమసిద్ధినగర్‌కు చెందిన ఫయాజ్ మోటార్‌సైకిల్‌పై కసుమూరుకు వెళుతుండగా మార్గం మధ్యలో కందలపాడు క్రాస్‌రోడ్డు వద్ద మోటారుబైక్ అదుపుతప్పడంతో గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా సర్వజన వైద్యశాలకు తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధ్యానంతో ఏకాగ్రత

మనుబోలు: ధ్యానంతో ఏకాగ్రత పెరుగుతుందని, తద్వారా విద్యార్థులు చదువుపై మనస్సును లగ్నం చేసేందుకు వీలవుతుందని యోగా శిక్షకుడు చెలికం కోటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యానికి, మానసికోల్లాసానికి ధ్యానం, యోగా సాధన ఎంతో ఉపకరిస్తాయన్నారు. గ్రంథాలయాధికారి అరుణ్ కుమార్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు చెడుఅలవాట్లకు లోనవకుండా వేసవి విజ్ఞాన శిబిరం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు ఆట విడుపుగా పుస్తకాలు చదవడం, చదివిన కథలను విశ్లేషించడం, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్స్, తదితరాలు చేయిస్తామని తెలిపారు.

పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కోవూరు: పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. కోవూరులోని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఏడో కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థను అభివృద్ధి పథంలో నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా 30 మేలు జాతి కోడె దూడలకు గానూ ఇప్పటి వరకు 14 ఒంగోలు, 2 ముర్రా జాతి కోడె దూడలను జిల్లాకు పంపిణీ చేసినట్లు తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 14 దూడలకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. పెయ్యి దూడల ఉత్పత్తి పథకం కింద ఇప్పటి వరకు 3,480 వీర్య నాళికలను సరఫరా చేశామని వివరించారు.

అభివృద్ధిలో రాజీ లేదు

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అభివృద్ధి విషయంలో రాజీపడబోమని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 39వ డివిజన్లో గల అలంకార్ సెంటర్, విక్టోరియా గార్డెన్స్, బ్రాహ్మణ అగ్రహారం, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బుధవారం నిర్వహించారు. సంక్షేమ పథకాలపై ప్రతి ఇంటికీ వెళ్లి వివరించిన అనంతరం ఆయన మాట్లాడారు. డివిజన్లో రూ.1.2 కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు, తదితర మరమ్మతు పనులను వచ్చే నెల మొదటి వారంలో ప్రారంభించనున్నామని చెప్పారు. నగర నియోజకవర్గంలో చిన్న పనులను రెండు నెలల్లో పూర్తి చేస్తామని వెల్లడించారు. నియోజకవర్గంలోని డివిజన్లలో 20 నుంచి 30 సీసీ కెమెరాల చొప్పున ఏర్పాటు చేసేలా చూస్తున్నామని తెలిపారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ప్రసన్న, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు సునీల్, ప్రసాద్, నిర్మల, నగరపాలక సంస్థకో ఆప్షన్ సభ్యుడు నరసింహరావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి పెద్దపీట

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైద్య రంగానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ఏడో డివిజన్లోని నవాబుపేట తోటబడి వద్ద రూ.1.05 కోట్లతో నిర్మించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. నగరంలో ఏడు అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించి డాక్టర్లు, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారని చెప్పారు. ఒక్కో ఆస్పత్రిలో రూ.15 లక్షలతో పరికరాలను సమకూర్చారని వివరించారు. పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఫస్ట్ రావడంపై ఆనందం వ్యక్తం చేశారు.

లెక్కలను దేవుడు సరిచేస్తారు

సీఎం పుణ్యమానని ఎమ్మెల్యేగా గెలిచి అందరం సంతోషంగా ఉన్నామన్నారు. అయితే సీఎంపై ఓ ఎమ్మెల్యే పోస్టర్లు వేస్తూ విమర్శలు చేయడం సిగ్గుచేటని చెప్పారు. ప్రభుత్వం వద్దకు సమస్యలను తీసుకెళ్లినప్పుడు కొన్ని పరిష్కారమవుతాయి.. మరి కొన్ని ఆలస్యమవుతాయని, అంతమాత్రాన దారుణంగా విమర్శలు చేయడం తగదని సూచించారు. దేవుడు అన్ని గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో అలాంటి వారిని ఓడించి లెక్కలు సరిచేస్తారని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ మాల్యాద్రి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.



అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్

సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరికి సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ కమిషనర్ వికాస్ మర్మత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కార్యాలయంలోని లీగల్ సెల్ విభాగానికి చెందిన ప్రవీణ్, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగానికి చెందిన చెంచయ్యకు నియామక పత్రాలను కమిషనర్ అందజేశారు. కార్యాలయ మేనేజర్ ఇనాయతుల్లా, పీఆర్వో కృష్ణారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెల్లూరు రూరల్: నగరంలోని 19వ డివిజన్లో గల మాగుంట లేఅవుట్లో సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులకు శంకుస్థాపనను ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను గుర్తించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నామని చెప్పారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, నేతలు రవి, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, రఘురామిరెడ్డి, శివారెడ్డి, శివప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ అభినందన



నెల్లూరు(బారకాసు): తిరుపతిలో నిర్వహించిన సీఎం కప్ హాకీ పోటీల్లో విజయం సాధించిన జిల్లా జట్టులోని క్రీడాకారుడు భానుప్రకాష్‌ను కమిషనర్ వికాస్ మర్మత్ అభినందించారు. నగర పాలక సంస్థ పరిధిలో వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీగా భానుప్రకాష్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో కమిషనర్‌కు ఆయన చాంబర్‌లో కప్‌ను చూపారు. హాకీలో ఉత్తమ ప్రతిభ చూపి కప్‌ను జిల్లా సొంతం చేసుకోవడం ఎంతో సంతోషకరమని చెప్పారు.

పారిశుధ్య పనుల పరిశీలన



నెల్లూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని 24వ డివిజన్ కల్లూరుపల్లి, హౌసింగ్‌బోర్డుకాలనీ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను మేయర్ స్రవంతి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా స్థానిక ప్రజలను చైతన్యపర్చాలని కోరారు. పందులు, కుక్కల బెడద లేకుండా తగు చర్యలు చేపట్టాలని చెప్పారు. కార్పొరేటర్ శాంతి, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



నెల్లూరు(క్రైమ్): కారుకు టింకరింగ్ పనులు చేస్తుండగా షార్ట్ సర్క్యూట్‌ై అగ్ని ప్రమాదం సంభవించిన ఘటన ఆటోనగర్‌లో బుధవారం చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది సమాచారం మేరకు.. నగరానికి చెందిన రోషన్ జమీర్ ఆటోనగర్‌లో టింకరింగ్ షెడ్‌ను నిర్వహిస్తున్నారు. మారుతి జెన్ కారుకు టింకరింగ్ చేస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. ఉవ్వెత్తున ఎగసిపడిన మంటలు కారుతో పాటు పక్కనే ఉన్న బంకుకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. ఘటనలో రూ.90 వేల ఆస్తినష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

తలసేమియా రోగులకు అండగా ఉందాం



నెల్లూరు(అర్బన్): తలసేమియాతో బాధపడే చిన్నారులకు అండగా ఉందామని రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ కోశాధికారి సురేష్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని దాదాపు 200 మంది తలసేమియా రోగులకు రెడ్‌క్రాస్ అండగా ఉంటూ వారికి రక్తాన్ని ఉచితంగా సరఫరా చేస్తోందని చెప్పారు. అనంతరం తలసేమియా రోగులకు సాయం అందించిన డాక్టర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సత్కరించారు. డాక్టర్ రమ్య, రాజేంద్రప్రసాద్, జిల్లా కార్యదర్శి మస్తానయ్య, సురేష్, కేన్సర్ ఆస్పత్రి మేనేజర్ జుబేర్, రెడ్‌క్రాస్ ప్రాజెక్ట్‌ల కన్వీనర్లు సుబ్బారెడ్డి, మురళి, రంజని, తదితరులు పాల్గొన్నారు.

ప్లానింగ్ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో ప్లానింగ్ అండ్ రెగ్యులేటరీ సెక్రటరీలుగా విధులు నిర్వర్తిస్తున్న ఆరుగురికి షోకాజ్ నోటీసులను జారీ చేశారు. గతంలో నిర్వహించిన రెండు సమావేశాలకు కోనేటిమిట్ట, రాజావారివీధి సచివాలయాలకు చెందిన సదరు ఉద్యోగులు గైర్హాజరు కావడంతో వీటిని జారీ చేశారు.

వెంకటేశ్వరుడి కల్యాణం రేపు

నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో కల్యాణ వెంకటేశ్వరస్వామికి కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం ఉదయం ఎనిమిదికి నిర్వహించనున్నామని మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లుగుప్తా, వెంకటరత్నం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులను నవాబుపేట పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. యనమలవారిపాళేనికి చెందిన రౌడీషీటర్ తేజపై తడికలబజార్ ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ గుణ, మణికంఠ, హరి హత్యాయత్నానికి సోమవారం పాల్పడ్డారు. ఘటనపై కేసు నమోదు చేసిన నవాబుపేట పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మణికంఠ, హరిని అరెస్ట్ చేశామని ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు తెలిపారు.

ధనలక్ష్మీపురంలో చోరీ

నెల్లూరు రూరల్: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన ధనలక్ష్మీపురంలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. ధనలక్ష్మీపురంలోని సరస్వతీనగర్‌లో బిహార్‌కు చెందిన రంజిత్ కుటుంబం నివసిస్తోంది. జిందాల్ కంపెనీలో ఏజీఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు. పిల్లలకు సెలవులివ్వడంతో బిహార్‌కు గత నెల 30న కుటుంబంతో కలిసి వెళ్లారు. ఈ క్రమంలో దుండగులు ఇంటి తాళాలను పగలగొట్టి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఇంటికి బుధవారం వచ్చిన ఆయన చోరీ విషయాన్ని నిర్ధారించుకున్నారు. ఆరు సవర్ల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘన సన్మానం

నెల్లూరు(బృందావనం): గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాయప్పను సంకీర్తన కళాసమితి, సుస్వర ఆర్కెస్ట్రా ఈవెంట్స్ ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ నిర్వాహకుడు ప్రసాద్, రమేష్, మోహన్‌రావు, జనార్దన్, మహేష్, సత్యం, మస్తాన్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



నెల్లూరు రూరల్: నరసింహకొండపై నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేల విరాళాన్ని హైదరాబాద్‌కు చెందిన శ్రీరక్ష కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. దాతలను ఘనంగా సత్కరించారు. చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సంక్షేమ పథకాలపై కరపత్రాలను అందజేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని 17వ డివిజన్లో గల వెలగచెట్టు సంఘంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. సంక్షేమ పథకాలపై కరపత్రాలను గడప గడపకూ వెళ్లి అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తామని చెప్పారు. స్థానిక సమస్యలను ఎంపీకి సీపీఎం నేతలు, తదితరులు తెలియజేయగా, వీటి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, మర్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, నేతలు కోటేశ్వరరెడ్డి, సుదీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయండి



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): జగనన్న కాలనీల్లో నిర్మాణ పనుల లక్ష్యాలను పూర్తి చేసి.. గృహాలను లబ్ధిదారులకు త్వరితగతిన అందజేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడ్కో గృహాలపై ఆసక్తి చూపని లబ్ధిదారులను గుర్తించి వారికి నోటీసులను జారీ చేయాలని సూచించారు.

శానిటరీ మస్టర్ పాయింట్‌లో తనిఖీ

ముందస్తు అనుమతుల్లేకుండా విధులకు గైర్హాజరైన సిబ్బందికి షోకాజ్ నోటీసులను జారీ చేయాలని.. వాటికి జవాబివ్వని వారిని విధుల నుంచి తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. 51వ డివిజన్ సుబేదారుపేటలోని శానిటేషన్ మస్టర్ పాయింట్‌ను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సిబ్బంది మెడికల్ లీవుల మంజూరుకు అధికారిక ప్రభుత్వాస్పత్రి నుంచి తీసుకొచ్చిన సర్టిఫికెట్లను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. అనంతరం రామ్మూర్తినగర్, జేమ్స్‌గార్డెన్, రైల్వేస్టేషన్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని పరిశీలించారు. ఎంహెచ్‌ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహార పంపిణీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. అసోసియేషన్ కోశాధికారి అనంతరామారావు, విమల వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారని అధ్యక్షుడు రఘురామ్ ముదిరాజ్ తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ 2022 అధ్యక్షుడు సుబ్బారెడ్డి, డీఈ శంకరయ్య, శేషగిరిరావు, రమణయ్య, రంగారావు, నరసింహారెడ్డి, రాఘవేంద్రశెట్టి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పుష్పయాగం



నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. స్వామి, ఆదిలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పుష్పయాగం, ఏకాంతసేవను రాత్రి నిర్వహించారు. ఉభయకర్తలుగా మురళీకృష్ణ, కమల దంపతులు, విశ్వనాథ్‌రావు కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవన ప్రారంభం



నెల్లూరు రూరల్: చింతారెడ్డిపాళెంలో తాత్కాలిక సచివాలయ భవనాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. శాశ్వత భవన నిర్మాణానికి శంకుస్థాపనను త్వరలో చేపట్టనున్నామని వారు చెప్పారు. అర్హులకు సంక్షేమ పథకాలను అందించే విషయంలో సచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



నెల్లూరు(పొగతోట): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని డీఎఫ్‌ఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. వివిధ శాఖలు, స్వయం సహాయక గ్రూపు సభ్యులతో నగరంలోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన శిక్షణ, అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ఏడు అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రజలకు అవగాహన కల్పించాల్సిందిగా లైనింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులకు సూచించారు.

ప్రమాణానికి సిద్ధం



మాట్లాడుతున్న ముక్కాల ద్వారకానాథ్

నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానానికి సంబంధించి రూ.ఆరు కోట్ల అవినీతి జరిగిందంటూ తనపై ఆరోపణలు చేయడం తగదని, ఈ విషయమై ప్రమాణానికి తాను సిద్ధమని నుడా చైర్మన్, దేవస్థాన పాలక మండలి గౌరవాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. ఆలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ కార్యాలయ వేదికగా తనపై కొందరు ఆరోపణలు చేశారని చెప్పారు. వ్యక్తిగతంగా తనను దూషిస్తే లెక్క చేయనని, అయితే అమ్మవారి దేవస్థానానికి సంబంధించి నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదని హితవు పలికారు. ఎంతో మంది తమ స్థాయికి మించి విరాళాలిస్తే అద్భుతమైన ఆలయాన్ని రూపొందించామని తెలిపారు. ఆరోపణలు చేసిన వారొస్తే చర్చించడానికి సిద్ధమంటూ ఆహ్వానించారు. తాను, కమిటీ, తన కుటుంబసభ్యులు ఈ విషయమై ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. తమపై ఆరోపణలు చేసిన వారు ఆలయానికి గురువారం ఉదయం 11 గంటలకు రావాలని, ఆలయానికి సంబంధించిన అన్ని లెక్కలను తెలియజేస్తామన్నారు. అర్బన్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు సీతారామారావు, గౌరవాధ్యక్షుడు సూర్యనారాయణ, దేవస్థాన పాలక మండలి చైర్మన్ మనోహర్, ప్రధాన కార్యదర్శి రామచంద్రరావు, శ్రీరామ్ సురేష్, గోపాల్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, శరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.